

కొంచెం ఇష్టం.. కొంచెం కష్టం..

కేంద్ర బడ్జెట్‌పై భిన్నాభిప్రాయాలు



ఆసిఫాబాద్, జూలై 23: పార్లమెంట్‌లో కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.48.21లక్షల కోట్ల బడ్జెట్‌ను మంగళవారం ప్రవేశపెట్టారు. కేంద్ర బడ్జెట్‌లో కేవలం బీహార్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకే అధిక నిధులు కేటాయించి తెలంగాణ రాష్ట్రానికి ఆశించిన స్థాయిలో కేటాయింపులు జరగలేదు. బడ్జెట్‌లో పన్నుల విధా నంలో మార్పులు తీసుకువస్తూ రూ.3లక్షల వరకు పన్నును మినహా యించారు. మూడు రకాల ఔషధాలపై జీఎస్టీని తగ్గించారు. బంగారం, వెండిపై ఆరుశాతం కస్టం డ్యూటీని బడ్జెట్‌లో తగ్గించారు. ముద్ర రుణాలను రూ.10నుంచి రూ.20లక్షల వరకు పెంచారు. దీంతో కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని వీధి వ్యాపారులకు, చిన్న, మధ్య తరహా కుటుంబాలకు ప్రయోజనం చేకూరనున్నది. వ్యవసాయ గ్రామీణాభి వృద్ధి మౌలిక వసతుల కల్పనకు నిధులను కేటాయించారు. వచ్చే ఐదేళ్ల లో 4కోట్ల ఉద్యోగాలే లక్ష్యంగా పెట్టుకోవడంతో జిల్లాలో నిరుద్యోగులకు ఉద్యోగవకాశాలు లభించే అవకాశం ఉంది. బడ్జెట్‌పై వివిధ పార్టీల, వర్గాల అభిప్రాయాలు ఈ విధంగా ఉన్నాయి.

అంకెల గారడీ బడ్జెట్..
బోగె ఉపేందర్, సీపీఐ జిల్లా నాయకుడు



కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ అంకెల గారడిగా ఉంది. బడ్జెట్‌లో ఏపీ, బీహార్ రాష్ట్రాలకు నిధుల విషయంలో పెద్దపీట వేసి రాష్ట్రానికి మొండి చేయి చూపారు. కాజీపేట్ రైల్వే కారిడార్, గిరిజన విశ్వవిద్యాలయంపై బడ్జెట్‌లో ఊసేలేదు. కార్మిక, కర్షకుల వ్యతిరేక కార్పొరేట్‌లకు అనుకూలమైన బడ్జెట్ ఇది.

ఉద్యోగులకు ఏం లాభం చేకూర్చలే..
కాంపెల్లి ఊశన్న, ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర నాయకుడు



కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఉద్యోగస్తులకు ఎలాంటి లాభం చేకూర్చలేదు. ఆదాయపన్ను విషయంలో ఉద్యోగస్తులను ప్రలోభానికి గురిచేశారు. ఆదాయ పన్ను విషయంలో కొంత వెసులుబాటు ఇచ్చినట్లు అనిపిస్తున్నా లోతుగా చూస్తే కొత్త విధానంలోకి మార్చడానికే ఇదంతా చేస్తున్నట్లు అర్థమవుతోంది. బడ్జెట్‌లో ఇతర రాష్ట్రాలతో పోల్చితే మన రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగింది.

కుర్చీ కాపాడుకోవడానికి పెట్టిన బడ్జెట్..
కొక్కిరాల విశ్వప్రసాద్‌రావు, డీసీసీ అధ్యక్షుడు



కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ చూస్తే కేవలం వారి కుర్చీ కాపాడుకోవడానికే పెట్టిన బడ్జెట్‌ల స్పష్టమవుతోంది. వికసిత్ భారత్‌లో 28రాష్ట్రాలు ఉంటే కేవలం రెండు రాష్ట్రాలే వికసించేలా ఏపీ, బీహార్ రాష్ట్రాలకు బడ్జెట్‌లో అధిక నిధులు కేటా యించారు. బడ్జెట్‌లో విభజన హామీలను విస్మరించి తెలంగాణకు తీవ్ర అన్యాయం చేశారు. పునర్వి భజన చట్టం తెలంగాణకు వర్తించదా?. పేదల ఆహారపదార్థాలపై దిగుమతి సుంకాలు తగ్గించకుండా కేవలం బంగారం, వెండి ధరలు తగ్గించడం బాధాకరం. ఇది పేదల బడ్జెట్ కాదు.. పెద్దల బడ్జెట్. బడ్జెట్‌పై బీజేపీ ఎంపీలు సిగ్గుతో తలదించుకోవాలి.

అన్ని వర్గాలకు సముచిత స్థానం
డాక్టర్ శ్రీనివాస్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు



కేంద్ర ఆర్థిక మంత్రి సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అన్నివర్గాల వారికి సముచిత స్థానం లభించింది. ఈ-కామర్స్ సంస్థలకు టీడీఎస్ తగ్గింపు శుభపరిణామం. కీలకంగా ఐటీ ఫైలింగ్ గడువు దాటినా కూడా సడలింపు ఇవ్వటం గొప్ప విషయం. ప్రధానంగా దీర్ఘకాలిక మూలధన లాభాలపై 12.5శాతం పన్ను విధించారు. సామాన్యుడికి ఎంతగానో మేలు జరిగేట్టు ఉంది. జీఎస్టీ కారణంగా సామన్యులపై భారం తగ్గింది. మరింత సరళంగా హేతుబద్ధంగా జీఎస్టీని మార్చారు.

స్లాబ్‌లతో అందరికీ భారం..
నజీర్ అలీ, వ్యాపారి, కాగజ్‌నగర్



కొత్త ట్యాక్స్ కేటాయింపులో రూ.3లక్షల వరకు పన్ను మినహాయింపు ఇచ్చినప్పటికీ రూ.3లక్షల నుంచి రూ.7లక్షల వరకు ఐదుశాతం, రూ.7లక్షల నుంచి రూ.10లక్షల వరకు 10శాతం పన్ను విధించటం సామన్యుడిపై భారం పడినట్టే అవుతుంది. అలాగే ప్లాస్టిక్ ఉత్పత్తులపై ఏకంగా 25శాతం పన్ను పెంచటం కూడా సామాన్యుడిపై భారం పడుతోంది. ఈ బడ్జెట్‌లో ఏడాదికి నాలుగు కోట్ల ఉద్యోగాల ఊసేలేదు. కార్పొరేట్ల పన్నులు 30నుంచి 22శాతానికి తగ్గించారు. దీంతో రూ.1.45వేల కోట్ల ఆదాయం కార్పొరేట్లకు మిగిలింది. పేదలకు పెద్దగా ఒరిగింది ఏమీ లేదు.

ఘనంగా బీఎంఎస్ ఆవిర్భావ వేడుకలు



బీఎంఎస్ ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న నాయకులు

కాగజ్‌నగర్, జూలై 23: పట్టణంలో మంగళవారం బీఎంఎస్(భారతీయ మజ్దూర్ సంఘ్) ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా బీఎంఎస్ నాయకులు కార్యాలయంలో జెండాను ఎగురవేశారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు మల్లేష్, జిల్లా సంఘటన కార్యదర్శి అన్నం రాజన్న మాట్లాడుతూ 70 సంవత్సరాలుగా వివిధ సమస్యలపై పోరాటాలు చేసినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఎంఎస్ నాయకుడు జిలుకర పోచయ్య, ట్రేడ్ యూనియన్ ఉపాధ్యక్షుడు వెంకటేష్, ప్రధానకార్యదర్శి ఎస్‌ఎంకె ప్రసాద్, కార్యకర్తలు పెంటు, జాన్ ప్రకాష్, సుదర్శన్, నానాయ్య, రాంకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలి: కలెక్టర్

ఆసిఫాబాద్, జూలై 23: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రైతు రుణమాఫీ పథకంలో అర్హతగల రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రుణమాఫీ అమలుచేయాలని కలెక్టర్ వెంకటేష్‌దోత్రే అన్నారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకును సందర్శించి రుణమాఫీ పథకం నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు ఎలాంటి షరతులు విధించకుండా నిబంధనల మేరకు జమైన రుణమొత్తాన్ని చెల్లించాలని తెలిపారు. కార్యక్రమంలో లీడ్‌బ్యాంకు జిల్లా అధికారి జోషి, తహసీల్దార్ శ్రీనివాస్, మేనేజర్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్య రక్షణకు ప్రత్యేక చర్యలు

ఆసిఫాబాద్: జిల్లాలో ప్రజల ఆరోగ్యరక్షణకు ప్రత్యేకచర్యలు తీసుకుంటామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. మంగళ వారం కలెక్టరేట్‌లో ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఏపీవోలు, ఏపీఎంలకు ఆఘాఖాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఒకరోజు శిక్షణ కార్యక్ర మంలో ప్రొఫెసర్ రమేష్, ఎన్విరాన్‌మెంట్ డైరెక్టర్ ప్రమోద్‌డబ్రసెతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బహిరంగ మలమూత్రవిసర్జనరహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అధికారులు సమన్వయంతో కృషిచేయాలన్నారు. అంటువ్యాధులు, విషజ్వరాలు ప్రబలకుండా ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. దోమల వృద్ధిని అరికట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి..

రెబ్బెన: ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, రికార్డులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే గర్భిణులకు ఎప్పటికప్పుడు సూచనలు, సలహాలు అందించాలన్నారు.క్రిటికల్‌గా ఉన్న కేసులను జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాలన్నారు. ఈ సందర్భంగా పలువురు రోగులు ఆసుపత్రి వైద్యుడు ప్రయివేటు ఆసుపత్రికి పోవాలని సూచించినట్టు కలెక్టర్ దృష్టికి తీసుకవచ్చారు. దీంతో కలెక్టర్ సంబంధిత డాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం కైరిగాం మండల పరిషత్ పాఠశాలను తనిఖీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో మరమ్మతులు, ఇతరాత్ర పనులుంటే వెంటనే క్లియర్ చేయాలన్నారు. వార్షిక ఫలితాల్లో జిల్లాకు మంచి పేరు తెచ్చేలా కృషిచేయాలని సూచించారు. అలాగే మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలన్నారు. ఆయన వెంట జిల్లా, మండల అధికారులున్నారు.



రెబ్బెనలో పీహెచ్‌సీలో మొక్కలు నాటుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

వర్షంతో వారసంతలో తిప్పలు

దహెగాం, జూలై 23: మండల కేంద్రంలో ప్రతి మంగళవారం నిర్వహించే వారసంతలో ప్రజలు వర్షంతో తిప్పలు పడ్డారు. వర్షాలు కురుస్తుండడంతో గద్దెలు లేక కూరగాయలు, వస్త్రవ్యాపారుల సరుకులు నీట తడిచి నష్ట పోతున్నామని వాపోతున్నారు. కూర్చోడానికి సైతం గద్దెలు నిర్మించకపోవడంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నామని పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.



తడినేలపైనే కూర్చున్న వ్యాపారులు

గోరింటాకు సందడి

బెజ్జూరు, జూలై 23: ఆషాడమాసం పురస్కరించుకొని మంగళవారం మండలకేంద్రంలోని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మహిళలు గోరింటాకు కార్యక్రమం నిర్వహించి సందడిచేశారు. ఈ సందర్భంగా వాసవీమాత విగ్రహాన్ని ప్రతిష్ఠించి పూజలు చేశారు. అనంతరం మహిళలంతా ఒకేచోట చేరి చేతులకు గోరింటాకు వేసుకున్నారు. ఆషాడమాసంలో మహిళలు గోరింటాకు వేసుకోవడం ఆనవాయితీగా వస్తోంది. కార్యక్రమంలో మహిళాసంఘం సభ్యులు పాల్గొన్నారు.



గోరింటాకుతో మహిళలు

పదోన్నతితో బాధ్యత పెరుగుతుంది: ఎస్పీ



పదోన్నతి పొందిన సిబ్బందితో ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు

ఆసిఫాబాద్, జూలై 23: పదోన్నతితో బాధ్యత పెరుగుతుందని ఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పదోన్నతి పొందిన మహ్మద్ బషీరుద్దీన్, గులాంమక్సుద్ అహ్మద్, నాగరాజు, తిరుపతి, పలువురు పోలీసుసిబ్బందిని ఆయన అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రమశిక్షణతో విధులు నిర్వర్తిస్తూ సర్వీస్‌లో మరిన్ని పదోన్నతులు పొందుతూ జిల్లాకు, వ్యక్తిగతంగా మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐ సతీష్, రాంబాబు, ఆర్‌ఐ అడ్మిన్ పెద్దయ్య, జిల్లాపోలీసుసంఘం అధ్యక్షుడు ఎంవీఎస్ రెడ్డి పాల్గొన్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి భద్రత చెక్కు అందజేత

ఆసిఫాబాద్ పోలీసుస్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న కె జలపతిరావు గుండెపోటుతో గతసెప్టెంబరులో మృతిచెందాడు. జలపతిరావు కుటుంబానికి మంగళవారం ఎస్పీ డీవీ శ్రీనివాస్ కార్యాలయంలో రూ.8లక్షల భద్రత చెక్కును అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మరణించిన పోలీసుల కుటుంబానికి పోలీసుశాఖ ఎప్పుడు అండగా ఉంటుందన్నారు. కుటుంబంలో అర్హతగల వ్యక్తికి ప్రభుత్వ ఉద్యోగం వచ్చేలా కృషిచేస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్‌ఐఅడ్మిన్ పెద్దయ్య, జిల్లాపోలీసు కార్యాలయ ఏవో శ్రీనివాస్, జిల్లా పోలీసుసంఘం అధ్యక్షుడు విజయశంకర్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ అజయ్‌వర్మ, జలపతిరావుభార్య,కుమారులు,కుమార్తె ఉన్నారు.

వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



సమస్యలను తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

కాగజ్‌నగర్, జూలై 23: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. మంగళవారం కాగజ్‌నగర్ పట్టణంలోని పలువార్డుల్లో ఆయన పర్యటించారు. వర్షాలతో ప్రభావితమైన లోతట్టు ప్రాంతాలను, కూలిపోయిన ఇండ్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్నందున లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. మున్సిపల్ సిబ్బంది, అధికారులు కూడా అలర్ట్‌గా ఉండాలన్నారు. ఆయన వెంట ఆర్డీవో సురేష్, కమిషనర్ అంజయ్య, డీఈ రమాదేవి, మేనేజర్ క్రాంతి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మహిళా శక్తి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి..

మహిళాశక్తి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. మంగళవారం మున్సిపాల్టీలో ఆయన ఐకేసీ సిబ్బందితో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల అభ్యున్నతి కోసం మహిళ శక్తి పథకాన్ని ఏర్పాటు చేసిందన్నారు. మహిళలకు రుణాలిస్తామన్నారు. సమావేశంలోఏపీడీరామకృష్ణ, పీడీమెప్మా మోతీరాంపాల్గొన్నారు.

దేశీదారు పట్టివేత

కాగజ్‌నగర్ , జూలై 23: మహారాష్ట్ర నుంచి కాగజ్‌నగర్‌కు అహిల్యానగరి ఎక్స్‌ప్రెస్‌రైలులో అక్రమంగా తరలిస్తున్న దేశీదారును మంగళవారం పట్టుకున్నట్టు సీఐ రవి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. తమకు ముందస్తు అందిన సమాచారం మేరకు అహిల్యానగరి ఎక్స్‌ప్రెస్ రైలును కాగజ్‌నగర్‌లో తనిఖీ చేయగా 175దేశీదారు బాటిల్లు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన్నట్టు తెలిపారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి: సీఐ



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్

వాంకిడి, జూలై 23: దొంగతనాల నియంత్రణకు మండల కేంద్రంలోని వ్యాపార సంస్థల నిర్వాహ కులు తమ సంస్థల వద్ద సీసీ కెమె రాలు ఏర్పాటు చేసుకోవాలని సీఐ శ్రీనివాస్, ఎస్సై సాగర్ అన్నారు. మంగళవారం వాంకిడి పోలీసుస్టేషన్‌లో వ్యాపార సంస్థల నిర్వాహకులతో సీసీ కెమెరాల ఏర్పాటుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దుకాణాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం వల్ల నేరాలను అరికట్టవచ్చన్నారు. జ్యువెలరీ షాప్, కిరాణ దుకాణం, ఇతర వ్యాపార సంస్థల వద్ద షాపు లోపల, బయట రోడ్డు కనిపించే వవిధంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. తద్వారా ఆగంతకులు రెక్కీ నిర్వహిస్తే గుర్తించి దొంగలను త్వరగా గుర్తించవచ్చన్నారు. ప్రతి దుకాణంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, వాటిని పరిశీలిస్తూ ఉండాలన్నారు. పని చేయని సీసీ కెమెరాలను వెంటనే రిపేర్ చేయించాలని తెలిపారు.

జగన్నాథ్‌పూర్ వంతెనపై రాకపోకల పునరుద్ధరణ

కాగజ్‌నగర్, జూలై 23: కాగజ్‌నగర్ జగన్నాథ్‌పూర్ వంతెనపై మంగళవారం రాకపోకలను పునరుద్ధరించారు. భారీ వర్షాలకు అప్రోచ్ రోడ్డు కొట్టుకుపోగా మరమ్మతులు చేశారు. దీంతో మంగళవారం నుంచి రాకపోకలకు అనుమతించారు.



మరమ్మతుల తర్వాత జగన్నాథ్‌పూర్ అప్రోచ్ రోడ్డు



'జనరల్ మజ్దూర్ పదోన్నతులు కల్పించాలి'

మందమర్రి టౌన్, జూలై 23: సింగరేణిలో బదిలీవర్కర్లుగా ఉద్యోగంలో చేరి 190నుంచి 240మస్టర్లు నింపిన కార్మికులందరికీ జనరల్‌మజ్దూర్ పదోన్నతులు కల్పించాలని, అదేవిధంగా 2023-24 ఆర్థికసంవత్సరానికి లాభాలవాటా 36శాతం చెల్లించాలని ఐఎన్టీయూసీసెక్రెటరీ జనరల్ జనక్‌ప్రసాద్ డిమాండ్ చేశారు. మంగళవారం ఈరెండుడిమాండ్లకు సంబంధించి సింగరేణి సీఎండీ బలరాంకు వినతిచేసినట్లు ఆయన పేర్కొన్నారు. రానున్నరోజుల్లో ఎప్పటికప్పుడు యాజమాన్యం దృష్టికి సమస్యలను తీసుకెళ్తామన్నారు. ఆగస్టు నెలలోపే లాభాల వాటా చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

'వృత్తిశిక్షణ కోర్సులను సద్వినియోగం చేసుకోండి'

మందమర్రి టౌన్, జూలై 23: మందమర్రి ఏరియా సింగరేణి సేవాసమితి ఆధ్వర్యంలో ఈనెల24నవృత్తిశిక్షణకోర్సులను ప్రారంభిస్తున్నట్లు యాజమాన్యం ఒక ప్రకటనలో పేర్కొంది. అంతకుముందు కోర్సులను పూర్తిచేసిన వారికి పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్లు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జీఎం హాజరవుతారని తెలిపారు.

శిక్షణ పొందిన మహిళలకు పరీక్ష

రెబ్బెన, జూలై 23: రెబ్బెన గోలేటిలోని సీఈఆర్ క్లబ్‌లో సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో వృత్తి విద్యాశిక్షణ పొందిన మహిళలకు మంగళవారం పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ బోర్డు రీజినల్ అధికారిణి అనసూయ మాట్లాడుతూ సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహించే వృత్తి శిక్షణ శిబిరాలను మహిళలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.కార్యక్రమంలో చీఫ్ కోఆర్డినేటర్ డీఎస్‌శివకుమార్, కెజీఎంవీ అధికారి బానోత్ నరేష్, సీనియర్ పీఓ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

'బొగ్గు గనుల వేలం సరికాదు'

మందమర్రి టౌన్, జూలై 30: కేంద్రం ప్రవేశపెట్టిన బొగ్గు గనుల వేలం సరికాని, దీనిని వెంటనే ఉపసంహరించుకోవాలని టీబీజీకేఎస్ రాష్ట్ర డిప్యూటీ జనరల్‌సెక్రెటరీ రాజశేఖర్ డిమాండ్‌చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బొగ్గుగనులను నిర్వీర్యం చేయడానికే వేలంఅని ధ్వజమెత్తారు. బొగ్గు బ్లాకులను సింగరేణికి కేటాయించాలన్నారు. త్వరలోనే టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో కార్మికసంక్షేమానికి సంబంధించి కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నామని తెలిపారు.

పర్యావరణ అనుమతులపై అవగాహన కలిగి ఉండాలి



కార్పొరేట్ ఎన్విరాన్‌మెంట్ జీఎం గణపతిని సన్మానిస్తున్న జీఎం, అధికారులు

మందమర్రి టౌన్, జూలై 23: బొగ్గుగనుల విస్తరణలో భాగంగా పర్యావరణ అనుమతుల చట్టాల గురించి అధికారులు అవగాహన కలిగి ఉండాలని కార్పొరేట్ ఎన్విరాన్‌మెంట్ జీఎం గణపతి, మందమర్రి జీఎం మనోహర్ అన్నారు. మంగళవారం మందమర్రి జీఎం కార్యాలయంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. చట్టాలను ఉల్లంఘిస్తే ప్రమాదం ఉంటుందన్నారు. పర్యావరణ అనుమతులు ఏ విధంగా పొందాలో ప్రతిఅధికారి తెలుసుకోవాలన్నారు.

గనుల్లో అధిక బొగ్గు ఉత్పత్తికి సంబంధించి గనుల విస్తరించే క్రమంలో పర్యావరణ అనుమతులే కీలకమన్నారు. అనంతరం మొదటిసారిగా మందమర్రికి వచ్చిన కార్పొరేట్ ఎన్విరాన్ మెంట్ జీఎం గణపతిని జీఎం మనోహర్, అధికారులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బెల్లంపల్లి జీఎం రవిప్రసాద్, ఎస్వోటూ జీఎం రాజేశ్వ ర్‌రెడ్డి, బెల్లంపల్లి, మందమర్రి పర్యావరణ అధికారులు, హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

'బీఎంఎస్‌తోనే కార్మిక సంక్షేమం'

శ్రీరాంపూర్, జూలై 23: బీఎంఎస్‌తోనే కార్మికసంక్షేమం సాధ్యమవుతుందని ఆ యూనియన్ కేంద్రఉపాధ్యక్షుడు చాట్ల అశోక్, ఏరియా ఉపాధ్యక్షుడు నాతాడి శ్రీధర్‌రెడ్డి అన్నారు. బీఎంఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వారు మాట్లాడారు. దేశరక్షణ, పరిశ్రమల పరిరక్షణ, కార్మికుల సంక్షేమం అజెండాగా మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని భోపాల్ పట్టణంలో 1955జూలై23న బీఎంఎస్ యూనియన్ ఆవిర్భవించిందన్నారు. ఆనాటి నుంచి అంచలంచెలుగా ఎదుగుతూ సంఘటిత, అసంఘటిత కార్మిక రంగంలో 150కి పైగా వివిధ అనుబంధ సంఘాలతో ఉన్నత ప్రమాణాలతో దేశంలోనే అత్యధిక సభ్యత్వం కలిగిన యూనియన్‌గా ఎదిగిందన్నారు. ఏ పార్టీ ప్రభుత్వం అధికారంలో ఉన్నా కార్మికుల శ్రేయస్సే పరమావధిగా పోరాడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ కేంద్ర కార్యదర్శులు రాగం రాజేందర్, జీడి ప్రభాకర్, బ్రాంచ్ కార్యదర్శి ఈశ్వరాచారి, కోశాధికారి గూడశ్రీకాంత్, సంయుక్తకార్యదర్శులు, కార్మికులు పాల్గొన్నారు.

కాసిపేట: కాసిపేట 2వగనిపై బీఎంఎస్ 70వ ఆవిర్భావవేడుకలను నాయకులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. బీఎంఎస్ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాసరాజు జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో ప్రదీప్‌కుమార్, రవీందర్, సంతోష్, ప్రదీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జైపూర్: జైపూర్ ఎస్టీపీపీలో బీఎంఎస్ ఆవిర్భావ వేడుకలను ఎస్టీపీపీ బీఎంఎస్ ప్రధానకార్యదర్శి దుస్స భాస్కర్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీఎంఎస్ నాయకులు వెంకటేశ్వర్లు, సురేందర్, శ్రీధర్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

'సింగరేణి సొమ్మును దుర్వినియోగం చేయొద్దు'

శ్రీరాంపూర్, జూలై 23: కార్మికులు తమ ప్రాణాలను పణంగా పెట్టి సంపాదించే సింగరేణి సొమ్మును దుర్వినియోగం చేయవద్దని హెచ్‌ఎంఎస్ ప్రధానకార్యదర్శి ఎండీ రియాజ్ అహ్మద్ ఒక ప్రకటనలో కోరారు. ఈ మేరకు ఆయన సింగరేణి సీఎండీ ఎన్ బలరాంకు లేఖ రాశారు. సింగరేణి ప్రభావితగ్రామాలు, సమీపగ్రామాలకు మౌలిక వసతులు కల్పించేందుకు డీఎంఎఫ్‌టీ, సీఎస్ఆర్ నిధులను సింగరేణి అందించాల్సి ఉందన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఈ నిధులను ప్రభావిత గ్రామాలకు కాకుండా ఇతర ప్రాంతాలకు తరలించాలరన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సైతం అదేదారిలో పయణిస్తోందన్నారు. ఇందులో భాగంగా ఇటీవల హైదరాబాద్‌లో "రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయహస్తం" పథకంలో భాగంగా సంస్థకు చెందిన రూ.4 కోట్లు అందించడం సరికాదన్నారు.

సమస్యల సాధనకు సమరశీల పోరాటాలు

మందమర్రి టౌన్, జూలై 23: కార్మికుల సమస్యల సాధనకు సమరశీల పోరాటాలు చేస్తామని ఐఎన్టీయూసీ సీనియర్ ఉపాధ్యక్షుడు కాంపెల్లి సమ్మయ్య, ఏరియా ఉపాధ్యక్షుడు దేవి భూమయ్య తెలిపారు. మంగళవారం మందమర్రి ఏరియా వర్క్‌షాపులో కార్మికులను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ సింగరేణిలో కార్మికులకు సంబంధించిన సమస్యలపై తాము కూడా ప్రణాళికలను రూపొందించామని, వాటి అమలు లక్ష్యంగా పని చేస్తామన్నారు. కార్మిక హక్కుల సాధనకు ఐఎన్టీయూసీ ఎలాంటి త్యాగాలకైనా వెనుకాడబోదన్నారు. సమావేశంలో నాయకులు పానుగంటి వెంకటస్వామి, పుల్లూరి లక్ష్మణ్, రాంశెట్టి నరేందర్, సూర్యనారాయణ, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.



రెయిన్ కోట్లు అందజేత

జన్నారం, జూలై 23: జన్నారం డివిజన్‌లో పనిచేస్తున్న బేస్ క్యాంపు సిబ్బందికి మంగళవారం తాళ్లపేట ఎఫ్‌ఆర్‌వో సుష్మారావు, ఇందన్‌పల్లి ఎఫ్‌ఆర్‌వో హఫీజుద్దీన్‌లు రేయిన్ కోట్లను అందజేశారు. బేస్ట్ ఇంటర్నేషనల్ నాన్ గవర్నమెంట్ ఆర్గనైజేషన్ (డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూఎఫ్)వారు రెయిన్ కోట్లు అందజేయగా తాము పంపిణీ చేశామని తెలిపారు.













40 రోజుల వయసులో ఆధార్‌కార్డు


బిజల్ ఫాతిమా


ఆధార్‌కార్డు

నస్పూర్, జూలై 23: నస్పూ ర్ కాలనీకి చెందిన సింగరేణి ఉద్యోగి మహ్మద్ అఫ్జల్ పా షా-సమీరాల కూతురు బిజల్ ఫాతిమా 40 రోజుల వయసులో ఆధార్ కార్డు పొందింది. మంగళవారం చిన్నారి తండ్రి మహ్మద్ అఫ్జల్ పాషా విలే కరులతో మాట్లాడారు. తమ కూతురు 2024 జనవరి 12న జన్మించిందని, ఈ సందర్భంగా ఏదైనా గుర్తుండే విధంగా చేయాలనే ఆలోచనతో జనన ధ్రువపత్రాన్ని త్వరగా తీసుకున్నారు. చిన్నారి బిజల్ ఫాతిమాకు 40 రోజుల వయస్సు ఉండగా ఆధార్ కార్డు కోసం మీ సేవలో దరఖాస్తు చేశామన్నారు. ఆధార్‌కార్డు వచ్చిన తర్వాత పాన్ కార్డు తీశామని, తాను గార్డియన్‌గా ఉండి బ్యాంకు ఖాతా తీసుకున్నానని అఫ్జల్ పాషా తెలిపారు.

పూర్వ విద్యార్థుల చేయూత

దండేపల్లి, జూలై 23: దండేపల్లి మండలం గుడిరేవు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం 'బడిబాగులో నేను' అనే విన్నూత కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బోలిశెట్టి బుచ్చన్న శ్రీకారం చుట్టగా పలువురు చేయూతనిందించారు. పాఠశాల పూర్వ విద్యార్థులు జంగిలి రాజు 5,000, దండేపల్లి చెందిన రాజన్న 3,000, బొలిశెట్టి రెడ్డి వెయ్యి, ధర్మపురికి చెందిన మహేష్ వెయ్యి రూపాయలు అందజేశారు.

గిరిజన ఆశ్రమ పాఠశాల సందర్శన

జన్నారం, జూలై 23: జన్నారం మండలంలోని కవ్వాలలలోని బాలికల ఆశ్రమ గిరిజన పాఠశాలను తెలంగాణ రాష్ట్ర మహిళ కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరిబాయి మంగళవారం సందర్శించారు. 9,10 తరగతుల విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం వంట గది, వంట సరుకులను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలన్నారు. అనంతరం ప్రధానోపాధ్యాయురాలు శైలజ కమిషన్ సభ్యురాలుకు పలు సమస్యలు విన్నవించారు.

బదిలీపై వెళ్తున్న ప్రిన్సిపాల్‌కు సన్మానం

ఏసీసీ, జూలై 23: మంచిర్యాల ప్రభుత్వ ఐటీలో విధులు నిర్వహించి బదిలీపై వరంగల్ ప్రభుత్వ ఐటీఐకి వెళ్తున్న ప్రిన్సిపాల్ చందర్‌ను ఐటీఐ కళాశాల ఆవరణలో మంగళవారం సిబ్బంది ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జీ ప్రిన్సిపాల్ రమేశ్, మందమర్రి ఐటీఐ ప్రిన్సిపాల్ దేవానంద్, ట్రైనింగ్ ఆఫీసర్లు దత్తాద్రి, సునీల్, సూపరింటెండెంట్ సతీష్, డీటీవోలు శ్రీధర్‌రాజు, హఫీజ్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న బ్యాగును అప్పగించిన పోలీసులు

మంచిర్యాల అర్బన్, జూలై 23: శ్రీరాంపూర్ నుంచి మంచిర్యాలకు ఆటోలో ప్రయాణించిన ఓ మహిళ తన బ్యాగును పోగొట్టుకొని మంచిర్యాల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా బ్లూకోల్ట్ పోలీసులు తిరిగి మంగళవారం అప్పగించారు. హెడ్ కానిస్టేబుల్ తిరుపతి, హోంగార్డు రఫీక్‌లను పోలీస్ అధికారులు అభినందించారు.

ఘనంగా బీఎంఎస్ ఆవిర్భావ వేడుకలు

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 23: జిల్లా కేంద్రంలోని బీఎంఎస్ కార్యాలయంలో, చున్నంబట్టివాడ, భగత్ సింగ్ నగర్‌లలో బీఎంఎస్ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి మద్దూరి రాజుయాదవ్ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణరెడ్డి, సెంట్రింగ్, పెయింటింగ్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

వరద నీటితో రోగాల బారిన పడుతున్నాం

మందమర్రిటౌన్, జూలై 23: నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో తమ కాలనీలో వరద నీరు చేరి రోగాల బారిన పడుతున్నామని ఇందు గార్డె న్ కాలనీ వాసులు అన్నారు. మంగళవారం కాలనీలో చేరిన పట్టణంలో వర ద నీటిలో దిగి నిరసన తెలిపారు. మున్సిపల్ అధికారులు కాలనీలో రోడ్లు వేయాలని ,నీరు నిల్వ ఉండకుండా చూడాలని కోరారు.

బీజేపీ యువమోర్చా పట్టణ యూత్ అధ్యక్షుడిగా శ్రావణ్

చెన్నూరు, జూలై 23: బీజేపీ యువమోర్చా పట్టణ యూత్ అధ్యక్షుడిగా సుంకరి శ్రావణ్‌ను నియమించినట్లు బీజేపీ పట్టణాధ్యక్షుడు జాడి తిరుపతి తెలిపారు. మంగళవారం నియామక పత్రం అందించారు.





రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

జైపూర్, జూలై 23: మండలంలోని ఇందారం వద్ద గల ఇండియన్ పెట్రోల్ బంక్ సమీపంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని మైదాబండ గ్రామానికి చెందిన మచ్చ అజయ్ (24) అక్కడికక్కడే మృతిచెందాడు. జైపూర్ ఎస్‌ఐ శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. అజయ్ కరీంనగర్ జిల్లాలోని మెట్‌పల్లిలోని హ్యూందాయ్ కారు షోరూంలో ఏసీ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. విధులు ముగించుకుని తన స్వగ్రామమైన మైదాబండకు కారులో వెళ్తుండగా ఇందారం సమీపంలోని పెట్రోలు బంకు వద్దకు రాగానే ముందు వెళ్తున్న లారీని వేగంగా ఢీకొనడంతో కారు నుజ్జునుజ్జయింది. అజయ్ తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతిచెందాడు. అజయ్ తండ్రి లక్ష్మణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. అజయ్‌కు ఇంకా వివాహం కాలేదు.

సమస్యలు పరిష్కరించాలి

- మున్సిపల్ కమిషనర్‌కు ఎంసీపీఐయూ నాయకుల వినతి

బెల్లంపల్లి, జూలై 23: పట్టణంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని మంగళవా రం ఎంసీపీఐయూ పట్టణ కార్యదర్శి ఆరేపల్లి రమేశ్, జిల్లా కార్యదర్శి పసులేటి వెంకటేష్ మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మా ట్లాడుతూ పట్టణంలోని 34 వార్డుల్లో చెత్తాచెదారం పేరుకుపోయి దోమలు,ఈగలతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారన్నారు. కాల్‌టెక్స్ నుంచి కొత్త బస్టాండ్‌వరకు రోడ్డుపై గుంతలు పడి వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని చెప్పారు. అలాగే వీధి కుక్కలు పెద్దలు, పిల్లలపై దాడులు చేస్తున్నాయని వివరించారు. పలు వార్డుల్లో వీధిలైట్లు నిరంతరం వెలుగుతూనే ఉంటున్నాయని పట్టించుకునేవారే కరువ య్యారని తెలిపారు. సమస్యలను పరిష్కరించాలని కోరారు.

'బడ్జెట్‌లో కార్మికులకు మొండిచేయి'

శ్రీరాంపూర్, జూలై 23: కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో కార్మికులకు మొండిచేయి చూపిందని టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి కె. సురేందర్ రెడ్డి, ఏరియా ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్, బీజేపీ పార్టీలు కార్మికుల ఆదాయపు పన్ను రద్దు చేస్తామని ప్రకటనలు చేసి ఇప్పుడు పట్టించుకోకపోవడం సరికాదని తెలిపారు.. సంబంధిత యూనియన్లు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

వసతి గృహాల్లో దోమల మందు పిచికారి

మంచిర్యాల అర్బన్, జూలై 23 : పట్టణంలోని ఎస్సీ బాలుర, మహాత్మా జ్యోతిబాపూలే బీసీ బాలికల, మైనార్టీ విద్యార్థుల వసతి గృహాల్లో మంగళవారం దోమల నివారణ కోసం ఆల్ఫాసైపర్‌మెత్రిన్ పిచికారీ చేశారు. విద్యార్థులకు దోమల బారిన పడి వ్యాధులకు గురికాకుండా ఉండేందుకు పలు సూచనలు చేశారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ అనిత పిచికారీ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ అల్లాడి శ్రీనివాస్, సబ్ యూనిట్ అధికారి నాందేవ్, ఆయా పాఠశాలల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడాకారుడికి ఆర్థిక సహాయం

ఏసీసీ, జూలై 23: మంచిర్యాల జిల్లా కేంద్రానికి చెందిన బాడీ బిల్డర్ వొల్లాది సాయిచరణ్‌కు రూ. 25 వేలను ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు నవీన్‌కుమార్‌గౌడ్‌కు మంగళవారం జిల్లా కేంద్రంలోని హనుమాన్ దేవాలయంలో అందజేశారు. ఆయన మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో ఆర్థిక సహాయం చేసినట్లు తెలిపారు. ఆగస్టు 17 నుంచి 19 వరకు హైద్రాబాద్‌లో జరిగే జాతీయ బాడీబిల్డింగ్ పోటీల్లో సాయిచరణ్ పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో రమేష్, శ్రీరంగరావు, కిరణ్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌డీవో హైదరాబాద్‌కు బదిలీ

మంచిర్యాల అర్బన్, జూలై 23: మంచిర్యాల ఎఫ్‌డీవోగా విధులు నిర్వర్తిస్తున్న వినయ్‌కుమార్ సాహు హైదరాబాద్ దూలపల్లిలోని తెలంగాణ ఫారెస్టు అకాడమీ డిప్యూటీ డైరెక్టర్‌గా బదిలీ అయ్యారు. ఈ మేరకు హైదరాబాద్ ప్రిన్సిపాల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ఆర్‌ఎం డోబ్రియల్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో నాగార్జున సాగర్‌లో ఎఫ్‌డీవోగా విధులు నిర్వర్తిస్తున్న కెసరేశ్వర్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

దోమల నియంత్రణకు ఫాగింగ్

నస్పూర్, జూలై 23 : వర్షకాలంలో దోమల వ్యాప్తిని నివారణకు మున్సిపల్ అధికారులు వార్డుల్లో ఫాగింగ్ (పొగ)ను మంగళవారం సాయంత్రం 23వ వార్డులో ప్రారంభించారు. డెంగ్యూ, మలేరియా, చికున్ గున్యా వ్యాధుల వ్యాప్తికి కారణమైయ్యే దోమల నివారణకు ఫాగింగ్‌ను చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రజలు పరిసరాల పరిశుభ్రతకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సుర్మిళ్ల వేణు, కమిషనర్ చిట్యాల సతీష్, 23వ వార్డు కౌన్సిలర్ అగల్‌డ్యూటీ రాజు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

● సీఐటీయూ నాయకుల డిమాండ్

నస్పూర్, జూలై 23: మధ్యాహ్న భోజన కార్మికులకు రావాల్సిన పెం డింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికు లకు పెండింగ్‌లో వేతనా లు, కోడిగుడ్ల బిల్లులు వెంటనే చెల్లించాలని తదితర సమస్యలపై నస్పూ ర్‌లోని సమీకృత కలెక్టరేట్ ఎదుట తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అధికారికి అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు దాసరి రాజేశ్వరి, ఎండి రఫియా, సీఐటీయూ జిల్లా కార్యదర్శి రంజిత్ కుమార్‌లు మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాం డ్ చేశారు. మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేట్ వారికి అప్పగించవద్దన్నారు. కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు, బిల్లులను వెంటనే విడుదల చేయాలన్నారు. కార్మి కులకు పది వేల వేతనం చెల్లించాలని కోరారు. గుర్తింపు కార్డులు ఇవ్వా లని, తక్షణమే వంట గదుల నిర్మాణం చేయాలన్నారు. గృహాలక్ష్మి పథకం కింద కాంగ్రెస్ ప్రభుత్వం మధ్యా హ్నం భోజన నిర్వహణ కోసం అవస రమైన గ్యాస్‌ను సబ్సిడీ ద్వారా సరఫరా చేయాలన్నారు. కోడిగుడ్లకు అదనంగా బడ్జెట్ కేటాయించాలని, రాగి జావ ఖర్చులకు డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులకు అదనపు పనికి అదనపు వేతనం చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. ఆందోళన కార్యక్రమంలో సీఐటీయూ మధ్యాహ్న భోజన పథకం యూనియన్ నాయకులు దూలం శ్రీని వాస్, గట్టు మహేందర్, సమ్మయ్య, సరిత, మధునమ్మ, లక్ష్మి, కళావతి, జ్యోతి, ఆయాలు, కార్మికులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

వేమనపల్లి, జూలై 23: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మండలంలోని ప్రజలందరు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి సూచించారు. ఇటీవల వర్షాలకు కొట్టుకుపోయిన మామడ తాత్కాలిక వంతెనను మంగళవారం పరిశీలించారు. అనంతరం మామడలో వర్షాలకు కూలిన ఇళ్లను కార్యదర్శి అశోక్‌తో కలిసి పరిశీలించారు.

రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలి

మందమర్రిరూరల్, జూలై 23 : రైతు బీమా దరఖాస్తులను మండల వ్యవసాయాధికారులకు అందజేయాలని జిల్లా వ్యవసాయాధికారి కల్పన అన్నారు. మంగళవారం సండ్రోన్‌పల్లిలోని రైతు వేదికను సందర్శించారు. ఆమె మాట్లాడుతూ రైతులకు రుణమాఫీకి సంబంధించి ఏమైనా సందేహాలుంటే రైతు వేదికలో అధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవచ్చన్నారు. 18 నుంచి 59 సంవత్సరాల లోపు రైతులు రైతు బీమా చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో ముత్యం తిరుపతి, రైతులు పాల్గొన్నారు.

దండేపల్లి: ఇప్పటి వరకు రైతు బీమా పథకా నికి దరఖాస్తు చేసుకోని రైతులు ఈనెల 30లోగా దరఖా స్తు చేసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి గోర్ల అంజిత్‌కుమార్ మంగళవారం ఓప్రకటనలో కోరారు. స్థానిక కార్యాలయంలో, రైతు వేదికల్లో ఏఈవోలకు దరఖాస్తు ఫారాలు నింపి అందజేయాలని సూచించారు.

నెన్నెల: కొత్తగా పట్టాదారు పాసుపుస్తకం పొందిన 18 నుంచి 59 ఏళ్ల లోపు రైతులు... రైతుబీమా పథకానికి ఆగస్టు 5లోగా దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి శ్రీకాంత్ కోరారు. కొత్త పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, నామిని ఆధార్‌కార్డు నకలు కాపీలు దరఖాస్తుకు జతచేయాలని పేర్కొన్నారు.

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

వేమనపల్లి, జూలై 23: వేమనపల్లి మండలంలో కురిస్తున్న వర్షాలకు ప్రాణహిత నది బ్యాక్ వాటర్‌తో పత్తి పంటలను నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం చెల్లించాలని బీజేపీ మండల అధ్యక్షుడు ఏట మధుకర్ డిమాండ్ చేశారు. మంగళవారం వేమనపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నది బ్యాక్ వాటర్‌తో మ ండలంలోని సుంపుటం, జాజులపేట, వేమనపల్లి , గొర్లపల్లి ,ముల్కలపేట , రాచర్ల గ్రామాల శివార్లలోని వందలాది పత్తి చేన్లు నీట మునిగాయని, ప్రభుత్వ అధికారులు తక్షణమే సర్వే చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు వెంకటేష్, శ్రీకాంత్, పుల్లయ్య, పోచన్నపాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

కాసిపేట, జూలై 23:సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని కాసిపేట ఎఎస్‌ఐ రవీందర్ అన్నారు. మంగళవారం కాసిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని దుబ్బగూడెంలో సైబర్ మోసాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీసులు, ఓసీపీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

బెల్లంపల్లి, జూలై 23 : పట్టణంలోని ఎస్సీ కమ్యూనిటీ హాలును కొందరు వ్యక్తులు వారి స్వలాభం కోసం తాకట్టు పెట్టారని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మంగళవారం బెల్లంపల్లి ఏసీపికి దళిత సంఘాల నాయకులు వినతి పత్రం అందించారు. కొందరు నాయకులు వారి స్వలాభం కోసం ఎస్సీ కమ్యూనిటీ హాలును తాకట్టు పెట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఈవిషయంపై విచారణ చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కుంబాల రాజేష్, చిన్నరాజం, ఐలయ్య, రాజనర్సు తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న సిబ్బందికి సన్మానం

లక్సెట్టిపేటరూరల్, జూలై 23: లక్సెట్టిపేట పోలీస్‌స్టేషన్‌లో పనిచేసి బదిలీపై దండేపల్లి పోలీస్‌స్టేషన్‌కు వెళ్తున్న ఏఎస్ఐ రాజేందర్, పీసీలు రమేశ్, రవిలను లక్సెట్టిపేట సీఐ అల్లం నరేందర్ మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. కార్యక్రమంలో ఎస్ఐ 2 తానాజీ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

జన్నారం, జూలై 23: మండలంలోని కలమడుగు గ్రామంలోని 1,2,3 అంగన్ వాడీ కేంద్రాలను సీడీపీవో రేష్మ మంగళవారం తనిఖీ చేశారు. రిజిష్టర్‌లను పరిశీలించారు. పిల్లలకు, గర్భిణులు బాలింతలకు, పిల్లలకు పౌష్టికాహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలని సీడీపీవో సూచించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ కవిత, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు నస్పూర్‌లో రక్తదాన శిబిరం

నస్పూర్, జూలై 23 : భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) వర్కింగ్ ప్రసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు పుట్టిన రోజును పురస్కరించుకుని బుధవారం జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు నస్పూర్ పట్టణ అధ్యక్షుడు అక్కూరి సుబ్బయ్య ఒక ప్రకటనలో తెలిపారు. మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు ఆధ్వర్యంలో నిర్వహించే రక్తదాన శిబిరంకు నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు. రక్తదాన శిబిరంకు జిల్లాలోని మూడు నియోజకవర్గాల నుంచి కార్యకర్తలు, నాయకులు పాల్గొననున్నారు.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి

నెన్నెల, జూలై 23: రైతువేదికల్లో రైతు నేస్తం పేరిట నిర్వహిస్తున్న వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి కల్పన అన్నారు. మంగళవారంచిత్తాపూర్ రైతువేదికలో రైతులతో కలిసి రైతునేస్తం కార్యక్రమాన్ని వీక్షించారు. కార్యక్రమంలో భీమిని ఏడీఏ ఇంతియాజ్ అహ్మద్, నెన్నెల ఏవో శ్రీకాంత్, ఏఈవోలు రామ్‌చందర్, మౌనిక, సుప్రజా తదితరులు పాల్గొన్నారు.

'తెలంగాణకు ద్రోహం చేస్తున్న కేంద్రం'

మందమర్రిటౌన్, జూలై 23 : తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం తీరని ద్రోహం చేస్తుందని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంగళవారం కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు మొండి చేయి చూపారని తెలిపారు. పార్లమెంట్ సమావేశాల్లో రాష్ట్ర ఎంపీలతో కలిసి కేంద్రం విధానాలను ఎండగడుతామని తెలిపారు.

బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడిగా రాజేంద్రప్రసాద్ నియామకం

మందమర్రిటౌన్, జూలై 23 : బీఎస్పీ చెన్నూరు నియోజకవర్గ అధ్యక్షుడిగా పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన ముల్కల రాజేంద్ర ప్రసాద్ నియమితులయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్, పెద్దపల్లి పార్లమెంట్ ఇన్‌చార్జ్ రవీందర్, జిల్లా అధ్యక్షుడు పవన్‌కుమార్‌లు రాజేంద్ర ప్రసాద్‌కు నియామక పత్రం అందజేశారు.

ట్రాక్టర్, కారు ఢీ..ఇద్దరికి తీవ్ర గాయాలు

బెల్లంపల్లి, జూలై 23: కన్నాలలోని జాతీయ రహదారి తిరుమల హిల్స్ యూటర్న్ వద్ద మంగళవారం ట్రాక్టర్, కారు ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల నుంచి కారులో కాగజ్‌నగర్‌కు గొల్లపూడి రవికుమార్-అనూష దంపతులు వెళ్తున్న క్రమంలో తిరుమల హిల్స్ యూ టర్న్ వద్ద ట్రాక్టర్ రోడ్డు దాటుతున్న క్రమంలో ఒక్కసారిగా కారు ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. దీంతో కారు ముందు భాగం నుజ్జునజ్జయి అందులో ప్రయాణిస్తున్న దంపతులకు తీవ్ర గాయాలయ్యాయి. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని వాహనంలో బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలకు వెళ్లాలని సూచించారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు. సంఘటన స్థలాన్ని సీఐ అప్జలొద్దీన్ పరిశీలించారు. కాగా ఇటీవల తరుచూ తిరుమల హిల్స్ వద్ద గల యూటర్న్ వద్ద రోడ్డు ప్రమాదాలు జరుగుతుండడం, మంగళవారం కూడా కారు ట్రాక్టర్ ఢీకొని ప్రమాదం జరగడంతో యూటర్న్‌ను నేషనల్ హైవే అధికారులు మూసివేశారు. గతంలో సైతం ప్రమాదాలు జరిగినప్పుడు యూటర్న్ మూసివేసి మళ్లీ కొద్ది రోజులు మూసివేసి మళ్లీ తెరిచారు. దీంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అధికారులు స్పందించి శాశ్వతంగా మూసివేయాలని వాహనదారులు డిమాండ్ చేశారు.


గాయపడిన రవికుమార్, అనూష

ఎన్నికల హామీలను అమలుపర్చాలి

● బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కేసరి అంజనేయులు గౌడ్

రెబ్బెన, జూలై 23: సీఎం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలుపర్చాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కేసరి అంజనేయులు గౌడ్ డిమాండు చేశారు. మంగళవారం గోలేటిలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో సీఎం రేవంత్ రెడ్డి వృద్ధాప్య, వితంతు పెన్షన్లు రూ4000, వికలాంగులకు రూ.6000 ఇస్తామని చెప్పినట్టు గుర్తు చేశారు. అధికారంలోకి రాగానే పెన్షన్లు పెంచుతామని తెలిపినట్టు వివరించారు. అయితే ఇంతవరకు అతీగతీ లేదన్నారు. ఇప్పటికైనా ఇచ్చిన హామీలను అమలుపర్చాలన్నారు. లేనిపక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామన్నారు. సమావేశంలో రాజయ్య, కేసరి సాయిగౌడ్, పుల్లయ్య, కిషన్ నాయక్, రాజయ్య పాల్గొన్నారు.

- బీసీ రిజర్వేషన్ అమలు చేయాలని మంగళవారం తహసీల్దార్‌కు బీజేపీ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసెంబ్లీ కన్వీనర్ సొల్లు లక్ష్మి, జిల్లా కార్యదర్శి బాలకృష్ణ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో సీఎం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండు చేశారు. లేకపోతే బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. మండల ప్రధానకార్యదర్శి జగన్నాథ ఓదెలు, రాంబాబు, మల్లేష్, జైశ్వాల్ ఉన్నారు.

వాంకిడి: బీసీ డిక్లరేషన్ చేయాలని మంగళవారం బీజేపీ ఓబీసీ మండలకమిటీ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీ సబ్‌ప్లాన్ కమిటీ సత్వరమే వేసి గొల్లకుర్మలకు గొర్రెలు, మత్స్యకారులు చేపల పిల్లలు పంపిణీ చేయాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో బీసీ నాయకులు దిలీప్‌కుమార్, బీజేపీ నాయకులు నరేష్, వేణు, హరీష్, రాము తదితరులు పాల్గొన్నారు.

బెజ్జూరు: సీఎం రేవంత్‌రెడ్డి బీసీ డిక్లరేషన్ చేపడుతామని కామారెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీని అమలు చేయాలని బీజేపీ నాయకులు మంగళవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో తిరుపతిగౌడ్, వెంకటేష్, దిగంబర్, బాలకృష్ణ,భిక్షపతి పాల్గొన్నారు.

సిర్పూర్(యు): కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ పేరుతో రైతులను మోసం చేస్తోందని బీజేపీ మండల అధ్యక్షుడు సిడాం శంభు ఆరోపించారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ స్థానికసంస్థల ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే రుణమాఫీపేరిట ప్రభుత్వం మోసం చేస్తోందన్నారు.

అర్హులైన వారందరికి రుణమాఫీ వర్తిస్తుంది

● జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు


కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు

సిర్పూర్(టి), జూలై 23: అర్హులైన ప్రతీ రైతుకు రెండు లక్షల రుణమాఫీ అవుతుందని జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని రైతువేదికలో నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొని రైతులతో మాట్లాడారు. ప్రభుత్వం మొదటి విడతలో లక్ష రూపాయలు, రెండో విడతలో లక్షపై ఉన్నవారికి రుణమాఫీ చేస్తుందన్నారు. లక్షలోపు రుణాలు మాఫీకాని రైతులు ఏఈవోల వద్ద రేషన్, గుర్తింపు, ఆధార్, పట్టాపాసు పుస్తకాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే ఈ నెల30 వరకు రైతుబీమా పథకం కోసం నామిని పేర్లు జత చేసుకోవాలన్నారు. అనంతరం మండలంలో కురుస్తున్న భారీవర్షాల వల్ల దెబ్బతిన్న పంటల గురించి ఏవోమధులతను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఈవోలు కవిత, శోభ, శ్రీనివాస్,నేహా తబస్సుం, రైతులు పాల్గొన్నారు.

చింతలమానేపల్లి: మండలంలోని బాలాజీఅనుకోడ రైతువేదికలో ఏవో రామకృష్ణ రుణమాఫీపై రైతులకు ఉన్నసందేహాలు నివృత్తిచేశారు. మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా వీడియోకాన్ఫరెన్స్ ద్వారా రైతులకు అవగాహన కల్పించారు. రైతులు ఎవరు అధైర్యపడొద్దని అర్హులైన వారికి రుణమాఫీ వర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు విజయ్, హెప్సిబా, కృపామణి, రైతులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్: ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ అమలు కాని రైతుల కోసం కాగజ్‌నగర్ మండలం చెక్‌పోస్టు సమీపంలోని రైతువేదిక వద్ద ఏవో రామకృష్ణ ఆధ్వర్యంలో రుణమాఫీ జాబితా పరిశీలన కార్యక్రమాన్ని నిర్వహించారు. రుణమాఫీ కాని రైతుల వివరాలను తీసుకున్నారు. రుణమాఫీ కాకపోవ డానికి గల కారణాలను రైతులకు వివరించారు.

కేస్లాపూర్ ఆలయ ప్రాంగణంలో వనమహోత్సవం

ఆసిఫాబాద్ రూరల్, జూలై 23: వనమహోత్సవంలో భాగంగా మంగళవారం జిల్లాకేంద్రంలోని కేస్లాపూర్ వీరాంజనేయస్వామి ఆలయం ఆవరణలో ఆలయకమిటీ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈసందర్భంగా కమిటీప్రతినిధులు మాట్లాడుతూ భవిష్యత్‌తరాల వారు ఆరోగ్యంగా ఉండేందుకు ప్రతిఒక్కరూ కనీసం అయిదు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. వివేక్, రమేష్,ఉదయ్, నారాయణమూర్తి, లక్ష్మణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీలో బయటపడిన అక్రమాలు


సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

ఆసిఫాబాద్‌రూరల్, జూలై 23: ఆసిఫాబాద్ మండల పరిధిలోని 27 గ్రామపంచాయితీల్లో గత ఆర్థిక సంవత్సరంలో చేసిన ఉపాధిహామీ పనులకు సంబంధించి సామాజిక తనిఖీని జిల్లాకేంద్రంలోని మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పనుల్లో అవకతవకలు బయటపడ్డాయి. సాయంత్రం 7 గంటల వరకు తొమ్మిది గ్రామపంచాయతీల తనిఖీ పూర్తికాగా అధికారులు తెలిపిన వివరాల ప్రకారం వివిధ పనులకు సంబంధించి రూ.32,600 జరిమానా విధించడంతో పాటు, రూ.1,26,200 రికవరీకి ఆదేశించినట్లు తెలిపారు. నాలుగు పనులను నాణ్యత ప్రమాణాల విభాగానికి బదిలీ చేసినట్లు 16మందికి షోకాజు నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. ఇంకా 18గ్రామపంచాయతీలు మిగిలి ఉండటంతో పెద్ద ఎత్తున అక్రమాలు బయటపడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

రాత్రి వరకు కొనసాగిన తనిఖీ..

అధికారులు సామాజిక తనిఖీని ఉదయం 10గంటలకు ప్రారంభించడానికి నిర్ణయించిన ప్పటికీ అనుకున్న సమయానికి ఎవరు రాక పోవడంతో మధ్యాహ్నం 12:30గంట లకు ప్రారంభమైంది. రాత్రి వరకు తనిఖీ కొనసాగించారు.

ఓవైపు వర్షం.. మరోవైపు విద్యుత్‌కోత..

వర్షం పడటంతోపాటు చీకటికావడంతో సామాజిక తనిఖీని ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశమందిరానికి మార్చారు. ఇదే సమయంలో విద్యుత్‌సరఫరా నిలిచిపోవడంతో లైట్లు పెట్టుకొని నిర్వహించారు. అధికారులు విషయాన్ని విద్యుత్‌అధికారులకు తెలియజేయడంతో విద్యుత్ పునరుద్ధరించారు. ఇంత ప్రాముఖ్యతగల తనిఖీకి కనీస ఏర్పాట్లు కూడా చేయకపోవడంపై పలువురుఅసహనం వ్యక్తం చేశారు. సమావేశంలో డీఆర్డీవో సురేందర్, సింగిల్‌విండోచైర్మన్ అలీబిన్‌అహ్మద్, విజిలెన్స్ అధికారి రేగెళ్ల కృష్ణమూర్తి పాల్గొన్నారు.

బేస్ క్యాంపు వాచర్లకు కిట్లు

కాగజ్‌నగర్, జూలై 23: ఫారెస్టు అటవీ డివిజన్‌లో బేస్ క్యాంపు వాచర్లకు ఎస్పీఎంఆధ్వర్యంలో కిట్లను పంపిణీచేశారు. కార్యక్రమంలో ఎస్పీఎం ప్రతినిధులు, సీసీఎఫ్ ఎఫ్‌డీపీటీ(కవ్వాల్) శాంతారాం, డీఎఫ్‌వో నీరజ్‌కుమార్, ఎఫ్‌డీవో అప్పలకొండ, ఎఫ్ఆర్‌వో రమాదేవి పాల్గొన్నారు.


వాచర్లకు కిట్లను పంపిణీ చేస్తున్న అధికారులు

రోడ్డుకు అడ్డంగా చెట్టు కొమ్మలు

సిర్పూర్(టి), జూలై 23: సిర్పూర్(టి)-కాగజ్‌నగర్ ప్రధానరహదారిపై ఇరువైపులా ఉన్నచెట్లకొమ్మలు వంగిఉండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయాల్లో రోడ్డు కనబడక పెద్ద ప్రమాదం చోటుచేసుకునే అవకాశం ఉందని వాహనదారులు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి చెట్లను తొలగించాలని కోరుతు న్నారు.

26న పోలీసు వాహనాల విడిభాగాల వేలం

ఆసిఫాబాద్, జూలై 23: పోలీసు వాహనాలకు సంబంధించిన వాడిన విడిభాగాలు, వాడిన టైర్లు, ఇంజన్, అయిల్, బ్యాటరీలు ఈ నెల26న పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో వేలం వేస్తామని ఆర్ఐ ఎంటీవో కె అంజన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల వారు వేలంలో పాల్గొనాలని అన్నారు.

కొనసాగుతున్న ప్రాణహిత వరద

● జల దిగ్బంధంలోనే తలాయి, తిక్కపల్లి, భీమారం గ్రామాలు

● వంద ఎకరాల్లో వరద నీరు


బెజ్జూరులో నీట మునిగి కుళ్లిపోతున్న పత్తి మొక్కలు


చింతలమానేపల్లిలో ఉధృతంగా ప్రవహిస్తున్న దిండా వాగు

బెజ్జూరు, జూలై 23: ప్రాణహిత నదికి వరద తగ్గినట్టే తగ్గి పెరుగుతోంది. సోమవారం రాత్రి వరకు తగ్గుతుందని అనుకున్న వరద ఉధృతి తెల్లవారు సరికి అమాంతం పెరుగుతూ వస్తోంది. దీంతో రైతుల్లో తీవ్రఆందోళన వ్యక్తమవుతోంది. మహారాష్ట్రలోని ఎగువప్రాంతంలో కురుస్తున్న భారీవర్షాలకు తోడు అక్కడి ప్రాజెక్టులనుంచి నీరు వదలిపెడుతుండడంతో ప్రాణహితకువరద ఉధృతి కొనసాగుతోంది. దీంతో మండలంలోని తలాయి, తిక్కపల్లి, భీమారం గ్రామాలు జల దిగ్బంధంలోనే మగ్గుతున్నాయి. తలాయి-పాపన్నపేట, తలాయి-సోమిని గ్రామాలమధ్య పూర్తిగా రాకపోకలు నిలిచిపోయి బాహ్యప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. సోమిని-తలాయి గ్రామాల మధ్యవంతెన ప్రాణహిత బ్యాక్‌వాటర్‌లో మునిగిపోయింది. వందలఎకరాల్లో పత్తిపంట నీటమునిగి పోయింది.

జలదిగ్బంధంలోనే దిండా గ్రామం

చింతలమానేపల్లి: మండలంలోని దిండా గ్రామం జలదిగ్బంధంలోనే ఉంది. వర్షాలతో కేతిని, దిండా గ్రామాలమధ్య ఉన్న వాగు ఉప్పొంగి ప్రవ హిస్తూ ఉండడంతో దిండా గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో తమ సమస్య తీర్చాలని ఇప్పటికే జిల్లా కలెక్టర్‌ను వేడుకుంటున్నారు. మండలంలోని బాబాసాగర్, నాయకపుగూడ వాగు, గూడెం శివపల్లి మధ్యలో ఉన్న ఒర్రె ఉప్పొంగి ప్రవహించడంతో ఆయాగ్రామాల ప్రజలకు సైతం రాకపోకల్లో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. లోతట్టు ప్రాంతంలో ఉన్న పత్తిపంట పూర్తిగా జలమయంగా కాగా రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో గల గూడెం ప్రాణహిత నది ఉప్పొంగి ప్రవహిస్తోంది. వంతెనను తాకుతూ పారుతుండడంతో పంట పొలాల్లోకి వరదనీరు వచ్చే అవకాశం ఉందని ప్రజలు పేర్కొంటున్నారు. రెవెన్యూ, పోలీసులు అధికా రులు ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు.

ప్రాణహిత బ్యాక్‌వాటర్‌లో నీటమునిగిన పంటలు

దహెగాం: మండలంలోని రాంపూర్, లోహ, దిగిడ, టెంపర్‌గాం గ్రామాల్లోని పత్తి, కంది తదితర పంటలు ప్రాణహిత బ్యాక్‌వాటర్‌లో మునిగి పోయాయి. పంటలు చేతికి వస్తాయో లేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు సర్వే చేపట్టి పంట నష్టపరిహారం ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

సంక్షిప్తం..

పెంచికలపేట: మండలంలోని బొంబాయిగూడ గ్రామం కోత్వాల్‌వాడకు చెందిన గోగు అంకుబాయి ఇల్లు ఇటీవల కురిసిన భారీవర్షానికి కూలిపోగా బీజేపీ నాయకుడు పాల్వాయి సుధాకర్‌రావు సందర్శించి బాధితురాలికి రూ.2వేల నగదుతో పాటు 25కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.

దహెగాం: మండలంలోని రైతువేదికలో రైతులకు పత్తిలో చీడపీడలు, అధికవర్షాల తరువాత పంటలలో యాజమాన్య పద్ధతులపై హైదరాబాద్ నుంచి శాస్త్రవేత్తలు వీడియోకాన్ఫరెన్స్ ద్వారా అవగాహన కల్పించారు.

కౌటాల: ఈనెల26,27,28తేదీల్లో హైదరాబాద్‌లోని కేటీఆర్ కన్వెన్షన్‌హాల్‌లో నిర్వహించే ఫొటోగ్రాఫర్ల ట్రేడ్ ఎక్స్‌షోకు సంబంధించిన పోస్టర్లను మంగళవారం మండల కేంద్రంలో ఫొటో, వీడియో గ్రాఫర్ల అసోసియేషన్ సభ్యులు విడుదల చేశారు.

కాగజ్‌నగర్: పట్టణంలో మంగళవారం దాశరథి శతజయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేశారు. కార్యక్రమంలో నాయకులు ఏఏఆర్ మూర్తి, నాగేశ్వర్‌రావు, కోటేశ్వరావు, ప్రతాప్‌సింగ్, విశ్రాంత సంఘం నాయకులు జయదేవ్, అల్లిరాజయ్య, నర్సయ్య, తదితరులున్నారు.

వాంకిడి: జిల్లాలోని వివిధప్రాంతాల్లో జాతీయ రహదారిపై బస్‌షెల్టర్ ఏర్పాటుచేయాలని డీవైఎఫ్ఐ నాయకులు డిమాండ్‌చేశారు. నాలుగు వరుసల రహదారి పూర్తైప్పటికీ కనీసం డీబీఎల్ కంపెనీ యజమాన్యం ఎక్కడ కూడా బస్ షెల్టర్ ఏర్పాటు చేయలేదన్నారు. జిల్లాలోని వివిధ మండలాల్లో జాతీయ రహదారికి పక్కన కళాశాలల ప్రాంతాల్లో బస్‌షెల్టర్‌లు ఏర్పాటు చేయక పోవడం వల్ల విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని జాతీయ రహదారిపై బస్‌షెల్టర్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

సిర్పూర్(యు): మండలంలోని గిరిజన సంక్షేమశాఖ పాఠశాలలకు ఐటీడీఏ ఆధ్వర్యంలో నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్నట్లు మహగాం ఎస్ఆర్పీ మారుతి తెలిపారు. మంగళవారం మండలకేంద్రంలోని ప్రెసిడెంట్‌గూడ గిరిజన సంక్షేమశాఖ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోట్‌బుక్స్ అందించారు.



సీఎంఆర్ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలి

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 23: జిల్లాలోని రైసుమిల్లులకు సామర్థ్యానికి అనుగుణంగా కేటాయించిన మిల్లింగ్, సీఎంఆర్ లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ మోతిలాల్ అన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని అదనపు కలెక్టర్ చాంబర్‌లో మంగళవారం జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ఉమారాణి, జిల్లా మేనేజర్ గోపాల్‌తో కలిసి రైసు మిల్లుల యాజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ 2023-24కు సంబంధించి యాసంగి, వానాకాలం సీఎంఆర్‌ను త్వరగా పూర్తి చేయాలని తెలిపారు.

వరదలతో నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

- ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి



అన్నారంలో నీట మునిగిన పొలాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి

కోటపల్లి, జూలై 23: భారీ వర్షాలు, వరదలతో పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందించి ఆదుకుంటామని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి అన్నారు. మంగళవారం మండలంలోని ప్రాణహిత పరివాహక గ్రామాల్లో పర్యటించారు. అన్నారంలో ప్రాణహిత ఉప్పొంగడంతో మునిగి నష్టపోయిన పంట పొలాలను పరిశీలించిన ఆయన పంట నష్టంపై వ్యవసాయ శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని సిర్సా, అన్నారం, జనగామ, సూపాక, వెంచపల్లి గ్రామాల్లో తీవ్ర నష్టం జరిగిందని, పంట నష్టంపై సర్వే చేయాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షపాతి అని జీవితంలో రైతులకు లక్ష రూపాయల రుణమాఫీ చేసిందని, త్వరలోనే రైతులకు రైతు భరోసా అంది స్తామన్నారు. అనంతరం దేవులవాడ గ్రామంలో వర్షాలకు బురదమయమైన రోడ్డును ఎడ్లబండిపై తిరుగుతూ పరిశీలించారు. గ్రామస్తులు బురద రోడ్డు గురించి ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే ఆయన రోడ్డు నిర్మాణానికి రూ. 12 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ వైస్‌చైర్మన్ మూల రాజిరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలి

మందమర్రి టౌన్, జూలై 23: విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలని సీఐ శశిధర్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని అంగడిబజార్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు, వాటర్ బాటిల్స్, స్లేట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణను అలవర్చుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై రాజశేఖర్, శ్రీవెన సేవా సంస్థ సభ్యులు చంద్రకాంత్, దాసరి శ్రీకాంత్, రావర్ల గణేష్, సాగర్, సదానందం, కిషోర్, వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్సై సీఐలను పాఠశాల సిబ్బంది సన్మానించారు.

పీఆర్టీయూటీఎస్ సభ్యత్వ నమోదు



ఉపాధ్యాయులకు సభ్యత్వం అందజేస్తున్న సభ్యులు

ఏసీసీ, జూలై 23: జిల్లా కేంద్రంలోని జడ్పీ బాలుర పాఠశాలలో పీఆర్టీయూటీఎస్ సభ్యత్వాన్ని మంగళవారం మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు టి ఐన్నారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులకు సభ్యత్వం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న ఉన్న ఉపాధ్యాయుల ఉమ్మడి సర్వీసు రూల్స్‌ను సాధిస్తామన్నారు. సర్వీసు రూల్స్ కోసం పీఆర్టీయూటీఎస్ ప్రణాళికాబద్ధంగా పనిచేస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సంఘం పెద్దలు సంప్రదించారని త్వరలోనే ఐందుకు సంబంధించిన నివేదిక సిద్ధమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో మాసపత్రిక సంపాదక వర్గ సభ్యుడు రాసపల్లి రవి, హెచ్‌ఎం సుధ, ఉపాధ్యాయులు పద్మజ, జ్యోతి, శ్రీనివాస్, బాపురావు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్‌ను అందించడమే లక్ష్యం

మంచిర్యాల అర్బన్, జూలై 23: వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయడమే లక్ష్యమని మంచిర్యాల సూపరింటెండింగ్ ఇంజనీర్ ఎన్ శ్రావణ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్కిల్ పరిధిలో 48 కెపాసిటర్ బ్యాంకులు పెట్టామని, ఇంకా 4 పెట్టనున్నట్లు ఆయన తెలిపారు. ఓల్టేజీ సమస్య తలెత్తకుండా విద్యుత్ సరఫరాలో ఓవర్ లోడ్ కాకుండా ఇవి నియంత్రిస్తాయని, వ్యవసాయ పంపుసెట్లకు, పారిశ్రామిక పీడర్లకు లోఓల్టేజీ వల్ల మోటర్లు కాలిపోకుండా పనిచేస్తాయని పేర్కొన్నారు. సబ్‌స్టేషన్లలో 1 లేదా 2 ఎంవీఏఆర్ కెపాసిటర్లను పెడుతున్నామని, అలాగే 11 కేవీ లైన్లలో 600 కెపాసిటర్లు అమర్చడం వల్ల పవర్ ఫ్యాక్టర్ మెరుగువుతుందని తెలిపారు.

మున్సిపల్ టౌన్ ప్లానింగ్ ఉద్యోగుల బదిలీ

ఏసీసీ, జూలై 23: మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ విభాగంలో పనిచేస్తున్న పలువురు ఉద్యోగులను బదిలీ చేస్తూ డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీప్లానింగ్ దేవేందర్‌రెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. మంచిర్యాల మున్సిపాలిటీలో టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్ పనిచేస్తున్న సత్యనారాయణను నిజామాబాద్‌కు, జీహెచ్‌ఎంసీ హైదరాబాద్‌లో టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్ గా పనిచేస్తున్న సంపత్‌ను మంచిర్యాల మున్సిపాలిటీకి బదిలీ చేశారు. రామగుండం కార్పొరేషన్‌లో టౌన్‌ప్లానింగ్ సూపర్ వైజర్‌గా పనిచేస్తున్న శ్యాంసుందర్‌ను మంచిర్యాల మున్సిపాలిటీకి బదిలీ చేశారు. మందమర్రి మున్సిపాలిటీలో టౌన్ ప్లానింగ్ సూపర్ వైజర్‌గా పనిచేస్తున్న రాజ్‌కుమార్‌ను మంచిర్యాల మున్సిపాలిటీకి బదిలీ చేశారు.

రైతులందరికీ రుణమాఫీ చేయాలి

జన్నారం, జూలై 23: రైతు రుణమాఫీ చేయడంలో ప్రభుత్వం పెడుతున్న కొర్రీలను వెంటనే ఉపసంహరించుకుని రైతులందరికి రైతులందరికీ రుణమాఫీ చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కలిందర్‌అలీఖాన్ డిమాండ్ చేశారు. జన్నారంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 70 లక్షల మంది రైతులు ఉండగా దాదాపు 50 నుంచి 60 లక్షల మంది రైతులు రుణాలు తీసుకున్నారని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం రైతులు ఎటువంటి కొర్రీలు లేకుండా రైతులందరికీ రుణమాఫీ చేయాలన్నారు. రైతు సమస్యలు పరిష్కరించకపోతే పోరాటాలు చేస్తామని తెలిపారు. సమావేశంలో పోచన్న, మహేందర్‌రెడ్డి, రాజేశం, తిరుపతి, విజయ్ పాల్గొన్నారు.

మెరుగైన ఫలితాల సాధనకు కృషి చేయాలి

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 23: కేంద్రీయ విద్యాలయంలో మెరుగైన ఫలితాల సాధనకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. కలెక్టరేట్ కార్యాలయంలో కేంద్రీయ విద్యాలయం అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నాణ్యమైన విద్య అందిస్తూ మెరుగైన ఫలితాలు సాధనకు కృషి చేయాలన్నారు. విద్యార్థుల దరఖాస్తులు ఆన్‌లైన్ ద్వారా ఐదు కేటగిరీలలో జరుగుతుందని నిబంధనల మేరకు లాటరీ ద్వారా ఎంపిక చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీఈవో యాదయ్య, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దుర్గా ప్రసాద్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చక్రపాణి, డీఎంహెచ్‌వో అనిత, కృష్ణరావు తదితరులు పాల్గొన్నారు.

రాజేశ్వర్‌రావుకు కవితా పురస్కారం

లక్షెట్టిపేటరూరల్, జూలై 23: లక్షెట్టిపేట పట్టణానికిచెందిన ప్రముఖ కవి లేదాళ్ల రాజేశ్వర్ రావుకు సాహిత్యంలో మక్కెన రామసుబ్బయ్య పౌండేషన్, విజయవాడ వారిచే ప్రతిష్ఠాత్మకమైన సెల్యూట్ కవితా పురస్కారం అందుకున్నారు. ఆయన రాసిన అమ్మకు ఓ జత చెప్పులు కొనాలి అనే కవితా సంపుటికి ఈ పురస్కారం దక్కింది. ఈ పుస్తకానికి ఇప్పటి వరకు మూడు జాతీయ స్థాయి కవితా పురస్కారాలు లభించడం విశేషం. విశాఖపట్నం పౌర గ్రంథాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ప్రముఖ వైద్యుడు పద్మశ్రీ కూటికుప్పల సూర్యారావు, ఫౌండేషన్ చైర్మన్ శ్రీను, ప్రముఖ కథారచయిత రాజారామ్మోహనరావు చేతుల మీదుగా రాజేశ్వర్‌రావు పురస్కారం అందుకున్నారు. ఆయనను సాహితీ ప్రవంతి సంఘం అధ్యక్షప్రధాన కార్యదర్శులు గాయత్రి, రవీంద్ర, శ్రీనివాస్, రవీందర్, మల్లేషం, తిరుపతి, జయ, బారతి అభినందించారు.

మళ్లీ నిరాశే..



- కేంద్ర బడ్జెట్‌పై ప్రజల నిట్టూర్పు
- తెలంగాణకు మొండి చేయి
- ప్రస్తావనకురాని సింగరేణియులు ఐటీ రద్దు
- ప్రత్యేక రైల్వే కేటాయింపులోనూ వివక్ష
- కార్పొరేట్ సెక్టార్‌కే అనుకూలమని అభిప్రాయం

మంచిర్యాల, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం మంగళవారం పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టిన బడ్జెట్ జిల్లాలోని ఆయా వర్గాల ప్రజలను నిరాశకు గురి చేసింది. కేంద్రంలో ముచ్చటగా మూడోసారి ప్రభుత్వం ఏర్పాటు చేసిన బీజేపీ ప్రజలకు అనుకూల బడ్జెట్ ప్రవేశ పెడుతుందని భావించిన ప్రజలకు నిరాశే మిగిల్చింది. కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశ పెట్టిన బడ్జెట్ కేవలం కార్పొరేట్ సెక్టార్ అనుకూలంగా ఉందనే అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. దేశంలో నిరుద్యోగం తాండవిస్తుండగా, ఉద్యోగాల కల్పన విషయం ప్రస్తావించక పోవడంతో పేద, మధ్యతరగతి కుటుం బాలు నిరాశకు లోనవుతున్నాయి.

ఇన్‌కం టాక్స్ ప్రస్తావన కరువు..

కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో సింగరేణి కార్మికుల ఇన్‌కం టాక్స్ ప్రస్తావన లేకపోవడంతో కార్మికలోకాన్ని నిరాశ నిస్పృహలకు గురి చేసోంది. తమ రక్తాన్ని చెమటగా మార్చి దేశానికి వెలుగులు అందించే కార్మికులు ఐటీ రూపంలో యేటా పెద్ద మొత్తంలో నష్టపోతున్నారు. దశాబ్దాలుగా కార్మిక సంఘాలు, రాజకీయ పార్టీలు ఐటీ రద్దు చేస్తామని ప్రకటనలు గుప్పిస్తూనే ఉన్నాయి. కనీసం ఈ బడ్జెట్‌లోనైనా ఐటీ రద్దు ప్రకటన వస్తుందేమోనని ఎదురు చేసినన సుమారు 40వేల మంది కార్మికుల ఆశలు అడియాశలు అయ్యాయి.

రైల్వేను విస్మరించిన కేంద్రం..

తెలంగాణలో రైల్వే ప్రయాణికులు అనేక సమస్యలతో సతమతం అవుతున్నా కేంద్ర బడ్జెట్‌లో వారి గోడును పట్టించుకోలేదు. కాజిపేట-బల్లార్షమధ్యలో కొత్త రైల్వే కేటాయింపు జరుగుతాయని ఉన్నా..ఆ ప్రస్తావన లేదు. అలాగే పాత రైల్వే పునరుద్ధరణ అంశానికి కూడా బడ్జెట్‌లో చోటు లభించలేదు. కాగా కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కొన్ని అంశాలు మాత్రం ఊరట కలిగించేవిగా ఉన్నాయి. బంగారం, వెండి ధరలు తగ్గనున్నాయి. సెల్‌ఫోన్లపై 15 శాతం కస్టమ్ డ్యూటీ, లెదర్ ఉత్పత్తులపై పన్ను శాతం తగ్గించారు. అలాగే సోలార్ ఉత్పత్తులపైనా కస్టమ్ డ్యూటీని తగ్గించడం కొంతమేర ఊరట కలిగించే అంశం.

సామాన్యులకు ఉపయోగం లేదు..

నారాయణ, రిటైర్డ్ లెక్చరర్



కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ కేవలం కార్పొరేట్ సెక్టార్ అనుకూలంగా ఉంది. సామాన్యులకు పెద్దగా ఉపయోగపడే పథకాలు ఏమీలేవు. కేవలం ఎన్డీయే భాగస్వామ్య రాష్ట్రాలకు మాత్రమే పెద్దపీట వేశారు. తెలంగాణకు పూర్తిగా మొండి చేయి చూపారు. దేశ ప్రజలందరిని సమానంగా చూడాల్సిన కేంద్రం వివక్ష చూపింది. విద్య, వైద్య, వ్యవసాయ రంగాలకు పెద్దగా ప్రాముఖ్యం ఇవ్వలేదు. సమాజం అభివృద్ధి సాధించాలంటే పై మూడు రంగాలకు బడ్జెట్ కేటాయింపులు ఉండాల్సిన అవసరం ఉంది.

సంక్షేమం ఊసేలేని బడ్జెట్..

రంగు రాజేశం, ఉద్యోగ సంఘాల సమన్వయ సమితి కన్వీనర్



బడ్జెట్‌లో కీలక విద్య, ఆరోగ్య రంగాలకు నామ మాత్రపు కేటాయింపులు చేశారు. జీఎస్టీ వసూళ్ల లక్ష కోట్లకు పైగా దాటినా బడ్జెట్‌లో కేటాయింపులు లేవు. డీజిల్, పెట్రోల్‌పై పన్నులు తగ్గించి ఉంటే ప్రజలపై తీవ్ర భారం మోపుతున్న నిత్యావసర వస్తువుల ధరలు తగ్గేవి. యువతకు ఉద్యోగాలు ఉస్మాన్యా హామీని పక్కనపెట్టి ఇంటర్న్‌షిప్ పథకాలు ప్రవేశపెట్టడం కంటితుడుపు చర్యే. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు కట్టుబడి ఉన్నామని ప్రకటించడం ద్వారా కార్పొరేట్లకు కొనసాగుతున్న ఊడిగం ఇకు ముందు ఉంటుందని చెప్పకనే చెప్పినట్లయింది.

వేతన జీవులకు నిరాశ..

శాంతికుమారి, ఉపాధ్యాయురాలు



కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ వేతన జీవులు, పెన్షనర్లను తీవ్ర నిరాశకు గురి చేసింది. పాత పన్నుల విధానంలో ఎటువంటి మార్పులు లేవు. స్లాబ్ రేట్లలో కూడా మార్పులు చేయలేదు. కొత్త పన్ను విధానంలో స్టాండర్డ్ డిడక్షన్ 50వేల నుంచి 75 వేలకు పెంచారు. అలాగే గతంలో ఆదాయం 3-6 లక్షల వరకు ఉంటే 5 శాతం పన్ను ఉండేది. ప్రస్తుతం 3-7 లక్షల ఆదాయానికి కూడా 5 శాతం పన్ను ప్రకటించారు. ఈ స్వల్ప మార్పులు తప్ప వేతన జీవులకు పెద్దగా ఉపయోగం లేదు.

రైతులకు ప్రయోజనం లేదు..

కేవీ చిదానంద కుమారి, న్యాయవాది



ఆరుగాలం శ్రమించి దేశానికి అన్నం పెట్టే రైతులకు కేంద్ర బడ్జెట్ ఏ మాత్రం మేలుచేసే విధంగా లేదు. పంటలకు మద్దతు ధరల్లో కూడా ఎలాంటి పెరుగుదల ప్రకటించలేదు. మొత్తంగా వ్యవసాయ సాగుకి ఒనగూరిన ప్రయోజనం పెద్దగా ఏమీ లేదు. అంతేగాకుండా ప్రజల దృష్టిని మరల్చే విధంగా అంకెల గారడీ చేశారు. గ్రామాల సమతుల్య అభివృద్ధి కోసం చేపట్టవలసిన ప్రత్యేక కార్యాచరణకు ప్రాధాన్యం ఇవ్వలేదు. కేవలం పట్టణాభివృద్ధి ప్రణాళికకే ప్రాధాన్యం ఇవ్వడం సమంజసం కాదు.

వరదల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

- పోలీస్ కమిషనర్ ఎం శ్రీనివాస్

కోటపల్లి, జూలై 23: భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో గ్రామాల ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం శ్రీనివాస్ అన్నారు. మండలంలోని అంతర్రాష్ట్ర వంతెనపై నుంచి ప్రాణహిత నది వరద ఉధృతిని, అర్జున గుట్ట వద్ద ఫెర్రీ పాయింట్‌ను మంగళవారం సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ వర్షాల నేపథ్యంలో నదుల వరదల వల్ల తలెత్తిన పరిస్థితులను పర్యవేక్షించి అవసరమైన సహాయక చర్యలు అందించేందుకు ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు. పలు చోట్ల లోలెవల్ వంతెనలు మునిగి రహదారులు పై నుంచి వరద ప్రవహించడం వల్ల రవాణా నిలిచిపోయిందన్నారు. ముంపునకు గురైన ప్రజలను ఎవరు ఆర్థైర్యపడవద్దని అన్ని శాఖల అధికారుల సమన్వయంతో జిల్లా పోలీసులు అందుబాటులో ఉంటారన్నారు. ఎలాంటి సమస్య తలెత్తినా 100కు ఫోన్ చేయాలని సూచించారు. సీపీ వెంట మంచిర్యాల డీసీపీ భాస్కర్, అడిషనల్ డీసీపీ రాజు, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్రరావు, చెన్నూరు రూరల్ సీఐ సుధాకర్, నీల్వాయి ఎస్ఐ శ్యాంపటేల్ తదితరులు ఉన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలను తనిఖీ చేసిన కలెక్టర్



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

కోటపల్లి, జూలై 23: ప్రభుత్వ కార్యాలయాల్లోని అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం, మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఉన్నత పాఠశాలలను మంగళవారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉద్యోగుల హాజరు రిజిస్టర్లు, రికార్డు గదులను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది విధుల నిర్వహణలో ప్రజలకు జవాబుదారీతనంతో వ్యవహరించాలని సూచించారు. మండల పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలన్నారు. భూసమస్యల పరిష్కారం కోసం ధరణి పోర్టల్‌లో అందించిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాకాలంలో గ్రామాల పరిధిలో పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ఆరోగ్య కేంద్రంలో వార్డులు, ఫార్మసీ, రిజిస్టర్‌లను పరిశీలించిన ఆయన వైద్యులకు, సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించిన కలెక్టర్ అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న పనులను పరిశీలించారు. తరగతి గదిలో పదో తరగతి విద్యార్థులతో మాట్లాడిన కలెక్టర్ విద్యార్థులు వార్షిక పరీక్షల్లో ఉన్నత మార్కులు సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. అనంతరం మండలంలోని నక్కలపల్లి దారిలో ఇటీవల వర్షాలకు దెబ్బతిన్న లోతొర్రెను పరిశీలించిన కలెక్టర్ ప్రజల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. మరమ్మతులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ మహేంద్రనాథ్, ఆటవీ డివిజనల్ అధికారి రమేష్, రోడ్లు భవనాల శాఖ, మండల అధికారులు పాల్గొన్నారు.

రైతులకు పరిహారం అందజేయాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి



పంట చేలల్లోకి చేరిన నీటిని పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

కోటపల్లి, జూలై 23: ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలతో మండలంలో నష్టపోయిన రైతులకు తక్షణం ప్రభుత్వం ఎకరానికి రూ. 20 వేల చొప్పున పరిహారం అందించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి డిమాండ్ చేశారు. మండలంలోని ప్రాణహిత పరివాహక ప్రాంతంలో వరదలతో నష్టపోయిన పంటలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంచపల్లి నుంచి దేవులవాడ వరకు వరదల వల్ల వందలాది ఎకరాల పంటలు నీట మునిగాయన్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రతి సంవత్సరం పంటలకు నష్టం వాటిల్లినా రైతులకు ఒక్కరూపాయి కూడా నష్టపరిహారం చెల్లించలేదన్నారు. ప్రస్తుత చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి గతంలో బీజేపీ పార్టీలో ఉన్న సమయంలో వరదల వల్ల నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారని, ఈ ప్రాంతానికి ఇప్పుడు ఆయనే ఎమ్మెల్యేగా ఉన్నందున సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి రైతులకు నష్టపరిహారం అందేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో పెద్దపల్లి పార్లమెంట్ కన్వీనర్ నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం అశోక్, అ సెంబ్లీ కన్వీనర్ అక్కల రమేష్‌బాబు, మండల అధ్యక్షుడు మంత్రి రామన్న, నాయకులు వెంకటకృష్ణ, కొత్తెప నాగేశ్వర్‌రావు, జాడి తిరుపతి, మధు, పున్నంచంద్, కొండపాక రాజు, శివప్రశ్న తదితరులు పాల్గొన్నారు.

● వికసిత్ భారత్ లక్ష్యంగా కేంద్ర బడ్జెట్

మంచిర్యాల కలెక్టరేట్: ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ వికసిత్ భారత్ లక్ష్యంగా ఉందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో నాయకులు వెంకటేశ్వర్‌రావు, హరిగోపాల్, రమేష్‌జైన్, నరేష్‌జైన్, రాకేష్, రాజు, అశ్విన్, అశోక్, సత్యనారాయణ, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ బిల్ పేరుతో సైబర్ నేరగాళ్ల దోపిడీ

మంచిర్యాల అర్బన్, జూలై 23: పట్టణంలోని హైటెక్‌సిటీ కాలనీకి చెందిన వనం రాము అనే వ్యక్తిని విద్యుత్ బిల్ పేరుతో సైబర్ నేరగాళ్లు మోసం చేసి రూ.5.23లక్షలు దోచేశారని పట్టణ సీఐ బన్సీలాల్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం ఈ నెల 15వ తేదీన బాధితుడి ఫోన్‌కు టీజీఎన్‌పీడీసీఎల్ నుండి ఓ లింక్ వచ్చింది. ఆ లింకును ఓపెన్ చేయగానే ఒక ఓటీపీ వచ్చింది. వెంటనే సైబర్ నేరస్థుడు రాముకు ఫోన్ చేసి బిల్ పెండింగ్ చేస్తున్నామని, ఓటీపీని షేర్ చేయాలని చెప్పాడు. దీంతో రాము ఆ ఓటీపీని ఆ సైబర్ నేరస్థుడి నంబర్‌కు షేర్ చేశాడు. ఆ తర్వాత రాము అకౌంట్ నుంచి రూ.5.23లక్షలు ఆ నేరస్థుడి అకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్ అయ్యాయని తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

జ్వరాలు ప్రబలకుండా నివారణ చర్యలు చేపట్టాలి

- జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు

చెన్నూరు, జూలై 23: వర్షాకాలంలో గ్రామాల్లో ఎలాంటి జ్వరాలు ప్రబల కుండా నివారణ చర్యలు తీసుకోవాలని ప్రత్యేకాధికారి, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు సూచించారు. మంగళవారం మండలంలోని అంగ్రాజ్‌పల్లి గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఆరోగ్య కేంద్రం ఆవరణను పరిశీలించి పిచ్చి మొక్కలను తొలగించాలని ఆదేశించారు. వైద్య సిబ్బంది హాజరు రిజిష్టర్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశా కార్యకర్తలు గ్రామాల్లో ఎప్పటికప్పుడు పర్యటిస్తూ ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి రిజిష్టర్లను పరిశీలించారు. గ్రామంలోని పలు కాలనీల్లో పర్యటించి శానిటేషన్, క్లోరినేషన్ పనులను తనిఖీ చేశారు. అనంతరం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ప్రజాపాలన కేంద్రంలో దరఖాస్తుల స్వీకరణ, ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను పరిశీలించారు. అలాగే చెన్నూరులోని ప్రభుత్వ పాఠశాలలో అమ్మఆదర్శ కమిటీ ద్వారా జరుగుతున్న పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని సూచించారు. అలాగే రెసిడెన్షియల్ పాఠశాల, మహాత్మాజ్యోతిబాపూలే పాఠశాలలను సందర్శించి వసతులను పరిశీలించారు. డైనింగ్‌హాల్, వంటశాలను, హాజరు రిజిష్టర్‌లను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులను సూచించారు. ఆయన వెంట ఎంపీవో అజ్మత్ అలీ, ఇరిగేషన్ ఏఈ చేత్, వైద్య సిబ్బంది ఉన్నారు.

సింగరేణి కాంట్రాక్టు ఉద్యోగులకు ప్రమాద బీమా

శ్రీరాంపూర్, జూలై 23: సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు రూ.30 లక్షల ప్రమాద బీమా వర్తింపజేయనున్నట్లు సీఎండీ ఎన్. బలరాం అన్నారు. హైదరాబాద్ నుంచి సంస్థ డైరెక్టర్లు, జీఎంలతో మంగళవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. హెచ్‌డీఎఫ్‌సీలో అకౌంట్ కలిగిన ప్రతి కాంట్రాక్టు కార్మికుడికి బీమా వర్తిస్తుందన్నారు. ఇతర బ్యాంకుల ద్వారా రూ. 50 లక్షల బీమా వర్తించేలా కృషి చేస్తామన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులకు సింగరేణి ఆస్పత్రులలో వైద్య సేవలు అందిస్తున్నామని, వారి కుటుంబ సభ్యులకు వైద్యం అందించే విషయమై ఈఎస్ఐ(ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్) ఆస్పత్రుల ఉన్నతాధికారులతో సంప్రదింపులు జరుపుతున్నామని తెలిపారు. సమావేశంలో డైరెక్టర్లు డి. సత్యనారాయణ(ఈ అండ్ ఎం), ఎన్‌వీకే శ్రీనివాస్(ఆపరేషన్స్, పర్సనల్), జి. వెంకటేశ్వర్‌రెడ్డి(ప్రాజెక్ట్, ప్లానింగ్), జీఎం(కో ఆర్డినేషన్) జి. దేవేందర్, అన్ని ఏరియాల జీఎంలు పాల్గొన్నారు.

సింగరేణికి నూతన బొగ్గు బావులను కేటాయించాలి

రామకృష్ణాపూర్, జూలై 23: సింగరేణికి నూతన బొగ్గు బ్లాకులను కేటాయించాలని ఏఐటీయూసీ నాయకులు అన్నారు. మంగళవారం ఆర్కే ఓసీ నందు కేంద్ర కమిటీ కార్యదర్శి అక్బర్ అలీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో వారు మాట్లాడారు. ఆర్కే ఓసీ ఎక్స్‌టెన్షన్ ప్రాజెక్టుకు త్వరగా పర్మిషన్ రావడం కోసం కేంద్ర బొగ్గు శాఖ మంత్రి కిషన్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందించామని తెలిపారు. ఈ సందర్భంగా కార్మికులు నూతన పిట్ సెక్రటరీ రామకృష్ణ, అసిస్టెంట్ పిట్ సెక్రెటరీ రాజేష్‌కుమార్‌ను శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో బ్రాంచ్ కార్యదర్శి లింగయ్య, సిద్ధం బాపు, వెంకటేశ్వర్‌రెడ్డి, సుదర్శన్, పరందామయ్య, బాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించేందుకే 'పల్లె నిద్ర'



రాంపూర్‌లో ప్రజలతో మాట్లాడుతున్న ఎస్ఐ ఆంజనేయులు

కాసిపేట, జూలై 23: ప్రజా సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకు పల్లెనిద్ర కార్యక్రమం చేపడుతున్నామని దేవాపూర్ ఎస్ఐ ఆంజనేయులు అన్నారు. దేవాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాంపూర్‌లో సోమవారం రాత్రి పల్లెనిద్ర చేపట్టారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలోని ప్రజలందరు కలిసి ఉండాలన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. యువత వ్యసనాలకు బానిస కావద్దన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల నివారణకు అందరు సహకరించాలన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు గ్రామస్తులు సహకరించాలని కోరారు. ప్రజలకు అత్యవసర సమయంలో డయల్ 100కు ఫోన్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపటేల్‌లు, పోలీసులు పాల్గొన్నారు.